క్లుప్తంగా

ల్యాప్‌టాప్‌లు పంపిణీ


భవిత పాఠశాల ల్యాప్‌టాప్ స్వీకరిస్తున్న ఎంఈఓ బస్వరాజ్

జహీరాబాద్: పట్టణంలోని పలు విద్యాసంస్థలకు ఎన్ఆర్ఐలు ల్యాప్‌టాప్‌లను బహూకరించారు. బుధవారం పట్టణంలోని భవిత ప్రభుత్వ మానసిక దివ్యాంగుల విద్యాలయానికి ఒకటి, ఎంఆర్‌హెచ్ఎస్‌కు 5, సెయింట్ పాఠశాలకు 2 చొప్పున పంపిణీ చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఎన్ఆర్ఐలు అక్షయ్, సుధీర్‌ల తరపున హైదరాబాద్‌కు చెందిన అశోక్‌కుమార్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. భవిత్ పాఠశాల తరపున ఎంఈఓ బస్వరాజ్ ల్యాప్‌టాప్ స్వీకరించారు. మరో ల్యాప్‌టాప్‌ను కూడా అందజేయనున్నట్లు దాతలు పేర్కొన్నారు. కార్యక్రమంలో భవిత ఉపాధ్యాయురాలు ఎల్.గౌతమి, ఎంఆర్‌హెచ్ఎస్ ప్రిన్సిపాల్ సబితారాణి, డాక్టర్ నరేన్‌జాన్, ఫిజియోథెరపిస్ట్ జయదీప్ పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని మార్కండేయ కాలనీలో బుధవారం బోరంచ పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణతో కార్యక్రమం నిర్వహించారు. మంగళ వాయిద్యాలతో విగ్రహాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. అనంతరం పూర్ణాహుతి, ప్రాణప్రతిష్ఠ లాంటి కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో గ్రామస్తులు పూజలు నిర్వహించి మొక్కులు సమర్పించుకున్నారు. ఎమ్మెల్యే కుమారుడు చింతా సాయినాథ్, మున్సిపల్ వైస్ చైర్మన్ గోపాల్, నాయకులు రాజు, నరేశ్, నాగేశ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు : కార్పొరేటర్ పుష్ప


సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ పుష్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివిజన్ పరిధిలోని కాకతీయనగర్ కాలనీలో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో బుధవారం బస్తీ దర్శన్ కార్యక్రమం నిర్వహించగా కార్పొరేటర్ పుష్ప పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలనీలో థీమ్‌పార్కు, వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్‌తో పాటు పలు అభివృద్ధి పనులకు నిధుల మంజూరు కోసం ఉన్నతాధికారులతో చర్చిస్తామని చెప్పారు. కాలనీ అధ్యక్షుడు అమృత్‌సాగర్, కాలనీవాసులు పాల్గొన్నారు.

దైవ చింతన అలవర్చుకోవాలి


దేవాలయంలో మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి

పటాన్‌చెరు: ప్రతి ఒక్కరూ దైవ చింతన అలవర్చుకోవాలని అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని బీరంగూడలో శ్రీ భ్రమరాంభ మల్లికార్జున వడ్డెర సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన కట్ట కింద పోచమ్మ దేవాలయ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నందారం నరసింహగౌడ్, కౌన్సిలర్ కవిత, నాయకులు, ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

అధికారుల తీరు సరికాదు

పటాన్‌చెరు టౌన్: ఎస్‌జీఎఫ్ క్రీడా ఉత్సవాల్లో భాగంగా పటాన్‌చెరులో ఏర్పాటు చేసిన కార్యక్రమ ఫ్లెక్సీలో ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ ఫొటోను విస్మరించడం సరికాదని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సైతం అధికారులు మంత్రి ఫొటో ఏర్పాటు చేయలేదని మండిపడ్డారు.

రేపు ఖేడ్ గురుకులంలో స్పాట్ అడ్మిషన్లు

నారాయణఖేడ్: ఖేడ్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల జూనియర్ కళాశాలలో ఈనెల 30న శుక్రవారం ఉదయం 10గంటలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ లింగారెడ్డి తెలిపారు. ఎంపీసీలో 12, బైపీసీలో 11, ఒకేషనల్‌కు సంబంధించి కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీలో 13 సీట్లు ఖాళీగా ఉండగా, వాటి భర్తీ కోసం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

ఆశలన్నీ దిగుబడిపైనే..!

- పప్పుధాన్యాల సాగు ఆశాజనకం
- పంటలకు అనుకూలంగా వాతావరణం
- పెరిగిన మద్దతు ధర
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు


జహీరాబాద్ ప్రాంతంలో సాగవుతున్న పెసర పంట

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ వ్యవసాయ శాఖ డివిజన్‌లో పప్పుధాన్యాల సాగు ఆశాజనకంగా ఉంది. జూన్, జులై నెలలో పంటలకు అనుకూలంగా వర్షాలు పడ్డాయి. వాతావరణం కూడా అనుకూలించడంతో పంటలు కళకళలాడుతున్నాయి. దీంతో రైతులు దిగుబడులపై ఆశలు పెట్టుకున్నారు. మార్కెట్‌లో పప్పుధాన్యాల కొరత ఉండటంతో అవగాహన ఉన్న రైతులు పెసర, మినుము, సోయాబిన్, కంది పంటలను వేశారు. ప్రస్తుతం పెసర, మినుము, సోయాబిన్ పూత, కాత దశలో ఉన్నాయి. కొన్ని చోట్ల పెసర పంటను కోస్తున్నారు. ఈ నెలాఖరు లేదా సెప్టెంబర్ రెండో వారం లోపు పంట దిగుబడులు చేతికి అందుతాయి. కంది పంట కాస్త ఆలస్యంగా కోతకు వస్తుంది.

1.95 లక్షల ఎకరాల్లో పంటల సాగు

జహీరాబాద్ వ్యవసాయశాఖ డివిజన్‌లో జహీరాబాద్, మొగుడంపల్లి, కోహీర్, ఝరాసంగం, న్యాల్‌కల్ మండలాలు ఉన్నాయి. ఆయా మండలాల్లో వర్షాధార పంటలను అధిక విస్తీర్ణంలో రైతులు పండిస్తుంటారు. ప్రధానంగా పత్తి, మొక్కజొన్న, జొన్నతో పాటు పప్పు ధాన్యాలైన పెసర, మినుము, సోయాబిన్ పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ఈ డివిజన్‌లో ఈ ఏడాది సుమారు 1.95 లక్షల ఎకరాల్లో పంటలను సాగు చేస్తున్నారు. 45 వేల ఎకరాల్లో సోయాబిన్, 6,617 ఎకరాలో మినుము, 11,203 ఎకరాల్లో పెసర, 45 వేల ఎకరాల్లో కంది పంటను వేశారు. పప్పు ధాన్యాలకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర కూడా పెంచింది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో క్వింటాలు కందులకు రూ.7,000 మద్దతు ధర ఉండగా ఈ ఆర్థిక సంవత్సరం నుంచి క్వింటాలకు రూ. 550 పెంచారు. మినులు రూ. 7,400 నుంచి రూ.8,682 వరకు, పెసరకు రూ. 8,558 నుంచి రూ. 8,682కు పెంచారు. పెంచిన ధరలు ఈ సెప్టెంబర్ నుంచి అమల్లోకి వస్తాయి. పప్పు, ధాన్యాలకు ఈసారి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. పంట సాగు విస్తీర్ణం తక్కువగా ఉండడం కొనుగోలుకు వ్యాపారులు మొగ్గు చూపుతున్నారు. దీంతో మార్కెట్‌లో పెసర, మినుములకు ఎక్కువ డిమాండ్ ఉంది.

అనుకూలంగా వర్షాలు



ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి పంటలకు అనుకూలంగా వర్షాలు కురుస్తున్నాయి. ఫలితంగా పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. పప్పు ధాన్యాలైన పెసర, మినుములు కోతకు వచ్చాయి. వారం రోజుల పాటు భారీ వర్షాలు పడకుంటే పప్పుధాన్యాల దిగుబడి ఆశాజనకంగా ఉంటుంది. మార్కెట్‌లో కూడా మంచి డిమాండ్ ఉండనుంది. అయితే పంటల విస్తీర్ణం ఆశించిన మేరకు లేదు, ఎక్కువ మంది రైతులు పత్తి పంట సాగుపై మొగ్గు చూపారు.

– భిక్షపతి, ఏడీఏ, జహీరాబాద్


అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న సిబ్బంది

అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు

ఇంద్రేశం పంచాయతీ కార్యదర్శి సుభాష్

పటాన్‌చెరు టౌన్: కూల్చివేసిన అక్రమ కట్టడాలను తిరిగి నిర్మిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఇంద్రేశం పంచాయతీ కార్యదర్శి సుభాష్ అన్నారు. బుధవారం మండలంలోని ఇంద్రేశం పీఎన్ఆర్ టౌన్‌షిప్‌లో రెండు భవనాలు గ్రామ పంచాయతీ నుంచి తీసుకున్న అనుమతులకు మించి నిర్మాణాలు చేస్తుండడంతో నోటీసులు జారీ చేశారు. వినకుండా పనులు చేస్తుండటంతో కూల్చివేతలు చేపట్టినట్లు తెలిపారు. పంచాయతీ అనుమతుల మేరకే నిర్మాణాలు చేపట్టాలన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ పైకి బిగించిన అధికారులు

హత్నూర(సంగారెడ్డి): ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్ కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. మండల కేంద్రమైన హత్నూరలోని మొదటి వార్డులో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంగళవారం పైకి బిగించినట్లు ఏఈ విజయ్ కుమార్ తెలిపారు. విద్యుత్ సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్ కిందికి ఉండడం వల్ల ప్రమాదం జరిగే అవకాశం ఉందని తమ దృష్టికి రావడంతో వెంటనే మరమ్మతులు చేయించినట్లు ఆయన తెలిపారు.


స్తంభానికి ట్రాన్స్‌ఫార్మర్‌ను పైకి బిగిస్తున్న దృశ్యం

సామర్థ్యం ద్వారానే సమాన అవకాశాలు

తారా కళాశాల ప్రిన్సిపాల్ రత్నప్రసాద్



సంగారెడ్డి ఎడ్యుకేషన్: సామర్థ్యం ద్వారానే సమాన అవకాశాలు వస్తాయని తారా కళాశాల ప్రిన్సిపాల్ కె ఎస్ రత్న ప్రసాద్ తెలిపారు. బుధవారం సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ కళాశాలలో విభాగాలు, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో రుబెరో స్వచ్ఛంద సంస్థ సహకారంతో జెండర్ సెన్సిటీషేషన్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సామర్థ్యం ఉంటే అవకాశాలను అందుకోవటంలో అందరూ సమానమేనని, ఇక్కడ మహిళలు, పురుషుల భేదాన్ని చూపాల్సిన అవసరం లేదన్నారు. మహిళలు అనేక రంగాలలో పురుషులతో సమానంగా అవకాశాలను అందుకోవడం చాలా సంతోషకరమని, ఈ విషయంలో ప్రపంచంలో భారతదేశం అన్ని దేశాలకు ఆదర్శమన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జి జగదీశ్వర్, కామర్స్ అధ్యాపకులు డాక్టర్ రత్న ప్రభాకర్, ఇతర అధ్యాపక బృందం, రుబ్బిరో స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండల కేంద్రంలో వరసిద్ధి వినాయక సహిత వీరహనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రామ్ మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠ చేశారు. సేవా భారతి యువజన సంఘం ఆధ్వర్యంలో యజ్ఞం, తదితర కార్యక్రమాలు చేశారు. మాజీ సర్పంచ్ జంగం స్వప్న, మాజీ ఎంపీటీసీ పీరప్ప, యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

◆ భూమి పూజలో ఎమ్మెల్యే

నారాయణఖేడ్: హైదరాబాద్‌లోని సచివాలయం ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటుకు బుధవారం నిర్వహించిన భూమి పూజలో సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి పాల్గొన్నారు.

◆ నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

నారాయణఖేడ్: కంగ్టి, సిర్గాపూర్ మండలాల్లో ఈనెల 29న గురువారం ఎమ్మెల్యే డా. సంజీవరెడ్డి లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేయనున్నట్లు ఆర్డీఓ అశోక చక్రవర్తి తెలిపారు. కంగ్టి మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 11.30 గంటలకు ఆ మండలానికి సంబంధించి, సిర్గాపూర్ రైతు వేదికలో ఆ మండలానికి సంబంధించి లబ్ధిదారులకు మధ్యాహ్నం 12.30 గంటలకు చెక్కుల పంపిణీ ఉంటుందని అన్నారు. కావున లబ్ధిదారులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పంపిణీ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

◆ గురుకులాల్లో స్పాట్ అడ్మిషన్లు

హత్నూర (సంగారెడ్డి): మండల కేంద్రమైన హత్నూరలోని సాంఘిక సంక్షేమ బాలుర జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు ఈనెల 30వ తేదీన స్పాట్ అడ్మిషన్లు ఉన్నట్లు ప్రిన్సిపాల్ భిక్షమయ్య గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్టిఫికెట్లతో నేరుగా కళాశాల ప్రధానాచార్యులను కలవవచ్చు. ఎస్సీ–4, ఎస్టీ–3, బీసీ, మైనార్టీ–1 ఓబీసీ–1 ఖాళీలు ఉన్నాయని ప్రిన్సిపాల్ తెలిపారు. 2022–23 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు టీసీ, మెమో బోనఫైడ్ కులం ఆదాయం సర్టిఫికెట్లు తీసుకొని కళాశాలలో సంప్రదించాలని ఆయన కోరారు.

◆ ఆటలు ప్రారంభం

పుల్‌కల్(అందోల్): పుల్‌కల్ మండల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభమయ్యాయి. సింగూరు గురుకుల పాఠశాలలో జరుగుతున్న క్రీడల్లో 14 నుంచి 17 ఏళ్ల వయస్సు కలిగిన విద్యార్థిని, విద్యార్థులు పాల్గొంటున్నారు. రెండు రోజులపాటు జరిగే వివిధ రకాల క్రీడల్లో విజేతలను ఎంపికచేసి జిల్లాస్థాయి పోటీలకు పంపుతారు.

◆ నేడు మున్సిపల్ సమావేశం

సదాశివపేట(సంగారెడ్డి): మున్సిపల్ సర్వసభ్య సమావేశం గురువారం ఉదయం 11.30 గంటలకు జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ ఉమ తెలిపారు. చైర్‌పర్సన్ అపర్ణ అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందన్నారు. గణేశ్ నవరాత్రి ఉత్సవాలు నిమజ్జనం గురించి చర్చ ఉంటుందని, ఈ సమావేశానికి పోలీసు, రెవెన్యూ విద్యుత్, అగ్నిమాపక, మున్సిపల్ అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కమిషనర్ కోరారు.

◆ ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని షాద్‌నగర్(గట్‌పల్లి), దేవునూర్ గ్రామాల్లో మంగళవారం అధికారులు పర్యటించి ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు చేసుకున్న దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి దరఖాస్తులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శశిప్రభ, తహసీల్దారు శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దారు శంభిరెడ్డి, ఇరిగేషన్ ఏఈ నిషిత, పంచాయతీ కార్యదర్శి శ్రీలత పాల్గొన్నారు.

◆ 'ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ'పై హర్షం

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్‌లో కేంద్రం ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీని ఏర్పాటు చేయడంపై బీజేవైఎం నియోజకవర్గం కన్వీనర్ నరేశ్ పాటిల్, రాష్ట్ర సభ్యుడు సోమ అనిల్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్మార్ట్ సిటీకి ఎంపిక చేయడంవల్ల ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నా రు. 74వేల మందికి ఉపాధి లభిస్తుందని, వేల కోట్ల పెట్టుబడులు వస్తాయని చెప్పారు.

◆ రుణమాఫీ కోసం ధ్రువపత్రాల స్వీకరణ

నారాయణఖేడ్: రుణమాఫీ కానిరైతులు తమ కుటుంబ సభ్యుల ఆధార్‌కార్డుల జిరాక్స్‌తో పాటు కుటుంబ ధ్రువీకరణ పత్రాలతో సంబంధిత క్లస్టర్‌ల ఏఈఓలను సంప్రదించాలని మండల వ్యవసాయ అధికారి శంకర్ పేర్కొన్నారు. మండలంలోని సంజీవన్‌రావుపేటలో బుధవారం రుణమాఫీకాని రైతులకు సంబంధించి రైతుభరోసా యాప్‌లో కుటుంబ సభ్యుల వివరాలను నమోదుచేసి ధ్రువపత్రాలను స్వీకరించారు. ఏఈఓ నరేష్ కుమార్, క్లస్టర్ పరిధిలోని రైతులు పాల్గొన్నారు.



వాహనదారులపై కేసు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రేడియల్ రోడ్డుపై నిబంధనలు పాటించని వాహనాదారులపై కేసు నమోదు చేసిన ఘటన కొల్లూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రేడియల్ రోడ్డుపై రాంగ్ రూట్‌లో వెళ్తున్న అయిదుగురు వాహనదారులను ట్రాఫిక్ పోలీసులు పట్టుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పుల్కల్‌లో స్కూల్‌గేమ్స్ ప్రారంభం


గేమ్స్ ప్రారంభిస్తున్న అధికారులు

సంగారెడ్డి: ఉమ్మడి పుల్కల్ మండలంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడోత్సవాలు బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరగనున్న ఈ క్రీడల్లో అండర్ 14, 17 బాలురు, బాలికలు పాల్గొననున్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్థాయిలో జరుగుతున్న ఈ క్రీడలను సింగూరు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణలో ఎంఈవో వి.శంకర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మండల కేంద్రమైన చౌటకూర్లో స్థానిక గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు కృష్ణారెడ్డి ప్రారంభించారు. మొదటి రోజైన బుధవారం అండర్ 14, 17 బాలికలు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో క్రీడల్లో పాల్గొని విజేతలుగా నిలిచారు. చౌటకూర్లో జరిగిన క్రీడల్లో సుల్తాన్ పూర్, శివంపేట, చౌటకూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల బాలికలు హాజరయ్యారు. కాగా, పుల్కల్ మండలంలో జరిగిన క్రీడలకు పుల్కల్ కేజీబీవీ, బస్వాపూర్ ఆదర్శ పాఠశాల, సింగూరు, పెద్దారెడ్డిపేట, ముదిమాణిక్యం, గొంగూరు, మిన్పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల బాలికలు హాజరయ్యారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు సీ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండల కేంద్రంలో బుధవారం మండల స్థాయి స్కూల్ గేమ్స్ నిర్వహించారు. హెచ్ఎం నాగం శ్రీనివాస్ క్రీడలను ప్రారంభించారు. కబడ్డీ, ఖోఖో, తదితర క్రీడ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో టీచర్లు రహీం, తదితరులు ఉన్నారు.

ముగిసిన ఎస్‌జీఎఫ్ పోటీలు


హోతి(కె) బాలికల గురుకుల విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న ఎంఈఓ బస్వరాజ్


కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని ఎంఆర్‌హెచ్ఎస్ పాఠశాల క్రీడా మైదానంలో రెండు రోజులగా నిర్వహించిన మండలస్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్)ఆటల పోటీలు బుధవారం ముగిశాయి. బాల బాలికల అండర్ 14, 17 విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించగా 25 ప్రభుత్వ, ప్రైవేట్, గురుకుల పాఠశాలల 600 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కబడ్డీ అండర్ 14 విభాగంలో ఆర్ఎల్ఆర్ స్కూల్ విద్యార్థులు గెలుపొందగా హోతి(కె) గురుకుల విద్యార్థులు రన్నరప్‌గా నిలిచారు. ఖోఖోలో హోతి(కె) గురుకులం విద్యార్థులు విజయం సాధించగా చిరాగ్‌పల్లి హైస్కూల్ విద్యార్థులు రన్నరప్‌గా నిలిచారు. వాలీబాల్ పోటీల్లో హోతి(కె) బాలికల గురుకులం విద్యార్థులు గెలుపొందగా జహీరాబాద్ హైస్కూల్ విద్యార్థులు రెండో స్థానంలో నిలిచారు. అండర్ 17 విభాగం ఖోఖో, వాలీబాల్ పోటీల్లో హోతి(కె) బాలికల గురుకులం విద్యార్థులు విజయం సాధించారు. కబడ్డీలో చిరాగ్‌పల్లి హైస్కూల్ విద్యార్థులకు విన్నర్ కాగా హోతి(కె) గురుకులం విద్యార్థులు రెండవ స్థానంలో నిలిచారు. విజేతలకు మండల విద్యాధికారి బస్వరాజ్ బహుతులను ప్రదానం చేశారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పీడీలు, పీఈటీలు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతిభ వెలికితీతకే పోటీలు

న్యాల్‌కల్(జహీరాబాద్): గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు తమ ప్రతిభను నిరుపించుకునేందుకు మండల స్థాయి క్రీడలు దోహద పడుతాయని ఎంఈఓ మారుతి రాథోడ్ అన్నారు. మండల పరిధిలోని హద్నూర్‌లో బుధవారం మండల స్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. మొదటి రోజున వాలీబాల్, కబ్బడీ, ఖోఖో క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల స్థాయిలో గెలుపొందిన విద్యార్థులకు తాలూకా, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీలు ఉంటాయన్నారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు ఇస్తామన్నారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాఫీకి రైతుల గుర్తింపు

చౌటకూర్‌లో వ్యవసాయాధికారులు ఇంటింటి సర్వే

సంగారెడ్డి: రుణమాఫీ కాని రైతులను గుర్తించేందుకు వ్యవసాయ అధికారులు బుధవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. మండల కేంద్రమైన చౌటకూర్‌లో ఏవో ప్రవీణ, ఏఈవో దత్తురాజు ఇంటింటికి తిరుగుతూ మూడు విడతల రుణమాఫీ జాబితాలో పేర్లు లేని రైతుల ఇళ్ల వద్దకు వెళ్లి వివరాలను సేకరిస్తున్నారు. రేషన్ కార్డులు లేకపోవడం, ఆధార్ నమోదులో దొర్లిన తప్పులతో పాటు ప్రభుత్వం నిర్దేశించిన ఇతరాత్ర ధ్రువపత్రాలు రైతుల వద్ద లేకపోవడంతో రుణమాఫీ జాబితాలో పేర్లు రాలేకపోయాయి. దీంతో గత రెండు, మూడు రోజులుగా రైతులు వ్యవసాయ అధికారులను సంప్రదించి అవసరమైన ధ్రువపత్రాలను జత చేసిన దరఖాస్తులను అందజేశారు. తమ వద్దకు వచ్చిన దరఖాస్తుల ఆధారంగా ఒక కుటుంబంలో ఎంత మంది రైతుల పేర్లపైన రుణాలు ఉన్నాయి. ఇందులో రుణమాఫీ అర్హతకు అర్హులో కాదో వివరాలను సేకరిస్తున్నారు. రుణమాఫీ కాని రైతులు కుప్పలు తెప్పలుగా దరఖాస్తు చేయడంతో మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి సర్వే చేయనున్నామని ఏవో ప్రవీణ తెలిపారు.


చౌటకూర్‌లో ఇంటింటి సర్వే చేస్తున్న వ్యవసాయాధికారులు

అమరుల పోరాట స్ఫూర్తితో ముందడుగు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య
- విద్యుత్ అమరవీరులకు నివాళులు


అమరుల చిత్రపటాలకు నివాళులు అర్పిస్తున్న సీపీఎం నేత వీరయ్య తదితరులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: బషీర్‌బాగ్ విద్యుత్ పోరాటంలో అసువులు బాసిన విద్యుత్ అమరవీరులకు బుధవారం సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వీరయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ పోరాట అమరుల స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్తామన్నారు. 2000 సంవత్సరంలో విద్యుత్ చార్జీల వ్యతిరేక ప్రదర్శన సందర్భంగా బషీర్‌బాగ్ వద్ద పోలీసులు జరిపిన కాల్పుల్లో రామకృష్ణ, బాలస్వామి, విష్ణువర్ధన్ రెడ్డిలు అమరులయ్యారని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల జాబితాలోని విద్యుత్‌ను లాగేసుకొని సంస్కరణలు తీసుకొచ్చిందని, జీఎస్టీతో రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి మీద దెబ్బ కొట్టారని విమర్శించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ ప్రతినిధి బృందం ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అమెరికా, దక్షిణ కొరియా దేశాల్లో పర్యటన చేసిందని, ఈ పర్యటనలో ప్రపంచ బ్యాంకు ప్రతినిధులతో తెలంగాణ అభివృద్ధి కోసం చర్చలు జరిపామని ప్రకటించారని తెలిపారు. అయితే.. ప్రపంచ బ్యాంకుతో ఏం చర్చలు జరిపారు? ఏం సలహాలు తీసుకున్నారో ప్రజలకు బహిర్గతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు, పాలడుగు భాస్కర్, రాష్ట్ర నాయకులు మల్లికార్జున్, సంగారెడ్డి, మెదక్ జిల్లా కార్యదర్శులు జయరాజు, మల్లేశం, రాజయ్య, మానిక్, సాయిలు, మహేందర్ రెడ్డి, నాగరాజు, బస్వరాజు, నరసమ్మ నాయకులు యాదగిరి, మహిపాల్, విద్యాసాగర్, పాండురంగారెడ్డి, నాగేశ్వర్ రావు, సురేష్, ఆఫీస్ సెక్రటరీ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై ఐక్యపోరాటం

సీపీఎం ఏరియా కార్యదర్శి ప్రవీణ్

సదాశివపేట(సంగారెడ్డి): విద్యుత్ పోరాట అమరవీరుల స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఐక్యపోరాటాలు చేస్తామని సీపీఎం సదాశివపేట ఏరియా కార్యదర్శి వి ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం విద్యుత్ అమరవీరుల సభను స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అమరులకు ఘనంగా నివాళులు అర్పించారు. 2000 సంవత్సరంలో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచడానికి నిరసిస్తూ ఆగస్టు 28వ తేదీన హైదరాబాద్ బషీర్‌బాగ్‌లో పెద్ద ఎత్తున నిర్వహించిన పోరాటంలో పోలీసుల జరిపిన కాల్పుల్లో ముగ్గురు వీర మరణం పొందారని చెప్పారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రమేష్ గౌడ్ బస్సు డ్రైవర్స్ యూనియన్ నాయకులు శ్రీనివాస్, మైబల్లి పాపయ్య, మహేందర్ పాల్గొన్నారు.


విద్యుత్ అమరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు